క్లుప్తంగా

హౌస్‌హోల్డ్ సర్వే వేగవంతం చేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: హౌస్‌హోల్డ్ సర్వేను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పాత ప్రభుత్వ వైద్యశాలలోని సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం డెత్, షిఫ్టింగ్ ఆప్షన్ ఇచ్చిన నేపథ్యంలో వాటిని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సర్వే సమయంలో ఏవైనా అనుమానాలు వస్తే తమను సంప్రదించవచ్చని సూచించారు. ఆయన వెంట పలువురు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మురుగు కాల్వల పూడికతీత పనులు చేయండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



తెనాలిఅర్బన్: పట్టణంలోని కొన్ని మురుగు కాల్వలు అధ్వాన్నంగా ఉంటున్నాయని, వాటిని ప్రతిరోజు బాగు చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం. లక్ష్మీపతి సూచించారు. 28వ వార్డులో గురువారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే మురుగు కాల్వల పూడికతీత పనులను పరిశీలించారు. కాల్వల్లో వ్యర్థాలు ఉండటం వలన పారుదల నిలిచిపోతుందని చెప్పారు. కాల్వల్లో ఎవరు వ్యర్థాలను వేయవద్దని సూచించారు. ఆయన వెంట పలువురు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

టెన్నిస్ క్రీడాకారుడు మహేష్‌కు అభినందన



తెనాలిరూరల్: ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుండి 25 వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన టెన్నిస్ టోర్నమెంట్‌లో విద్యుత్ శాఖ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తితో కలిసి పాల్గొన్న తెనాలి లైన్‌మ్యాన్ కొమరగిరి మహేష్ జాతీయ స్థాయిలో రన్నర్స్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మహేష్‌ను పలువురు అభినందించి సత్కరించారు. టెన్నిస్ క్రీడాకారుడైన త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు అఫీషియల్స్ క్లబ్‌లో గురువారం క్లబ్ సభ్యులతో కలసి శాలువా పూలమాలలతో మహేను సత్కరించి అభినందించారు. భవిష్యత్‌లో మరెన్నో విజయాలు పొందాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు సిరి అభిజ్ఞ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆమె తండ్రి నంబూరు కుమార్ ఆధ్వర్యంలో సాలీపేటలోని స్పెషల్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు లాంగ్ నోటుబుక్స్, పెన్నులు, పెన్సిల్‌లు, బిస్కెట్ ప్యాకెట్లు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు కాకరపర్తి సుబ్రమణ్యం, అధ్యక్షుడు నెరెళ్ళ కృష్ణమోహన్, కిక్కిరి చిన్నకృష్ణారెడ్డి, పాదర్తి వెంకటేశ్వరరావు, హెచ్ఎం జయలక్ష్మి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

శివకుమారి మృతికి సంతాపం



తెనాలిఅర్బన్: విధి నిర్వహణలో బాధ్యతహితంగా శివకుమారి ఉండేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కొర్ర విజయలక్ష్మి కొనియాడారు. నందుపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఇటీవల మృతి చెందిన ఆశా కార్యకర్త శివకుమార్ చిత్రపటానికి గురువారం ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈదుగుల అన్నపూర్ణ, మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కారుమూరి హెలెన్ నిర్మల, వైద్యాధికారిణి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి, హెల్త్ విజిటర్ చింతల ప్రసన్న పుష్పలత, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వరం - సేవలు అపారం

- విస్తృతమైన ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబోరేటరీ
- అందుబాటులోకి వచ్చిన 104 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- క్యాన్సర్, థైరాయిడ్ వంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబోరేటరీ పేద ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోంది. దాదాపు అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయటంతో పాటు త్వరితగతిన రిపోర్టులు అందిస్తు రోగులకు సహాయపడుతుంది. గతంతో పోల్చుకుంటే నేడు దానిని సేవలు విస్తృతం కావటంతో పేద ప్రజలు వ్యాధినిర్ధారణ పరీక్షలు బయట చేయించుకునే అవసరం లేకుండా పోయింది.

తెనాలి జిల్లా వైద్యశాలలో అధికారులు గతంలో ఒక ల్యాబోరేటరీని ఏర్పాటు చేశారు. అది చిన్న ల్యాబ్ కావటం వల్ల కేవలం కొన్ని రకాల పరీక్షలు మాత్రమే అక్కడ చేసేవారు. మిగిలిన వాటిని ప్రయివేట్ ల్యాబ్‌లలో చేయించుకోవాల్సి వచ్చేది. ఇలాంటి సమయంలో కేంద్రప్రభుత్వం తెనాలి జిల్లా వైద్యశాలలోని ల్యాబ్‌ను అధునీకరించి ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు ఇటీవల చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా ల్యాబ్‌ను రూ.40 లక్షలతో ఆధునీకరించింది. అంతేకాకుండా రూ.85 లక్షలతో రక్త, మూత్ర, కళ్ళే పరీక్షలు చేసేందుకు అవసరమైన లేటెస్ట్ మిషనరీని కొనుగోలు చేసి తెనాలి పంపింది.

ల్యాబ్ సేవలు ప్రారంభించి ఏడాది

తెనాలి జిల్లా వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్ సేవలు నవంబర్ 2023లో ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం పంపిన అన్ని రకాల మిషన్‌లను అధికారులు ఏర్పాటు చేసి వాటిని ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 200 మందికి 2,500 రకాల వ్యాది నిర్ధారణ పరీక్షలు ఇక్కడ చేస్తున్నారు. అంటే నెలకు ఆరువేల మందికి పైగా దీని సేవలు ఉపయోగించుకుంటున్నారు. గతంలో ఏడాదికి 25 వేల వ్యాది నిర్ధారణ పరీక్షలు చేయగా నూతన ల్యాబ్ వచ్చిన తర్వాత ఏడాదికి 60 వేల పరీక్షలు చేస్తున్నారు.



ల్యాబోరేటరి

చేస్తున్న పరీక్షలు ఇవే..

హిమోగ్లోబిన్, టోటల్ కౌంట్, ఎంసీవీ, ఈసీఆర్, బ్లడ్ షుగర్, బ్లడ్ యూరియా, ఆర్‌హెచ్ టైపింగ్, సీరమ్ క్రియాటిన్, టోటల్ ప్రొటిన్, హెచ్‌ఐవీ, బెటరాలిజికల్ టెస్ట్ ఫర్ వాటర్, సీరమ్ సోడియం, సీరమ్ పొటాషియం, డెంగూ, యూరిన్ ప్రగ్నెసీ టెస్ట్, మలేరియా, వీడీఆర్ఎల్, ఎఈసీ, టోటల్ కొలెస్ట్రాల్, టోటల్ ప్రొటిన్, క్యాన్సర్ స్కీనింగ్ టెస్ట్, థైరాయిడ్, ఇన్‌ఫెక్షన్ కల్చర్ వంటి 104 రకాల పరీక్షలు ఇక్కడ చేస్తున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ఐపీహెచ్ఎల్ ల్యాబ్‌లో ప్రస్తుతం పెథాలజిస్టులు డాక్టర్ ప్రసన్న, డాక్టర్ మస్తాన్‌వలిలతో పాటు ల్యాబ్ ఇన్‌చార్జి ఒకరు, మైక్రోబయాలజిస్ట్ ఒకరు, ల్యాబ్ టెక్నీషియన్‌లు-12 మంది, ల్యాబ్ అటెండెంట్‌లు-3, పనిచేస్తున్నారు. వీరు కాకుండా ఐడీఎస్‌పి విభాగంలోని ల్యాబ్ టెక్నీషియన్ ఒకటి, ల్యాబ్ అటెండర్ పోస్ట్ ఒకటి నేటికి ఖాళీగా ఉన్నాయి. రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో సేవలు అందించేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీగా పోస్టలను భర్తీ చేయటంతో పాటు అదనంగా మరికొంత మందిని నియమిస్తే రోగులకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు ఆలోచన చేయాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.



రిపోర్టులు తీసుకుంటున్న రోగులు

2024 ఏప్రిల్ నుంచి ల్యాబ్ చేసిన పరీక్షల వివరాలు ఇవి

నెల	పరీక్షల సంఖ్య
ఏప్రియల్	46,134
మే	52,162
జూన్	56,434
జూలై	55935
ఆగస్ట్	62,605
సెప్టెంబర్	63,074
అక్టోబర్	48,607
నవంబర్	52,442

పై పట్టికను పరిశీలిస్తే దీనిని పేద ప్రజలు ఏమేరకు ఉపయోగించుకుంటున్నారో మనకు అర్థమౌతుంది.



పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నిషియన్లు

ల్యాబ్ సేవలు ఉపయోగించుకోండి



తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబోరేటరిలో క్యాన్సర్ స్కీనింగ్ పరీక్షలు, థైరాయిడ్, ఇన్‌ఫెక్షన్ కల్చర్, హార్మోన్ ఎనలైజర్, సెల్ కౌంట్ వంటి పరీక్షలతో పాటు రక్తం, మూత్ర, కళ్ళే పరీక్షలు ఇక్కడ చేయటం జరుగుతుంది. అవసరమైన వారు ల్యాబ్‌లో అందిస్తున్న సేవలను ఉపయోగించుకోవాలి.

–డి.సుధీర్ బాబు,
ల్యాబ్ ఇన్‌చార్జి,
జిల్లా వైద్యశాల, తెనాలి.

శ్రీనివాసరావుకు తైక్వాండో కోచింగ్ సర్టిఫికెట్



తెనాలిఅర్బన్: తైక్వాండో ఇండియా ఆధ్వర్యంలో పూణెలో జరిగిన ఏటీయు తైక్వాండో మాస్టార్స్ పోటీల్లో తెనాలికి చెందిన కె.ఎస్.ఆర్ తైక్వాండో అకాడమీ నిర్వాహకులు కొక్కిల్లిగడ్డ శ్రీనివాసరావు పాల్గొని తైక్వాండో కోచింగ్ సర్టిఫికెట్ సాధించినట్లు ప్రముఖ వ్యాపారి ఈదర వెంకట పూర్ణచంద్ తెలిపారు. పోటీలు ఈ నెల 11 నుంచి 15 వరకు జరిగినట్లు చెప్పారు. గురువారం తెనాలిలోని తైక్వాండో అకాడమీ ఆవరణలో శ్రీనివాసరావుకు సర్టిఫికెట్ అందజేసి అభినందించారు.

పేదలకు ఉచితంగా దుప్పట్ల పంపిణీ



తెనాలి: చేనేతబంధు ప్రగడ కోటయ్య, పద్మశాలీ సంఘ రాష్ట్రనేత గుర్రం గాంధీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం 200 మంది పేదలకు ఉచితంగా దుప్పట్లను పంపిణీ చేశారు. ముత్యంశెట్టిపాలెంలోని పద్మశాలీయ కల్యాణ మండపంలో ట్రస్ట్ బాధ్యులు చేవూరు రాధిక, చేవూరు లావణ్య ఆధ్వర్యంలో దుప్పట్లతో భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు గంజి శివభుజంగ ప్రభాకరరావు, రాచాబత్తుని శ్రీనివాసరావు, కటకం వెంకట ప్రసాద్, తుమ్మలచర్ల వెంకటకృష్ణ, దామర్ల మదనమోహన్ రావు పాల్గొన్నారు.

సాంఘిక విప్లవ పితామహుడు పూలేకు ఘననివాళి

తెనాలి: భారత సాంఘిక విప్లవ పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి రోజైన గురువారం తెనాలిలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలే విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. పూలే జన్మించేనాటికే దేశంలో నాలుగుపాదాలా నడుస్తోందని, కులవ్యవస్థలో అట్టడుగున్న ఉన్న అస్పృశ్యులు, స్త్రీల సమస్యల పరిష్కారానికి పూలే కృషిచేశారని పార్టీ నాయకులు గుర్తుచేసుకున్నారు. తన రచనలతో చైతన్యం చేయటమే కాకుండా వితంతువులు, అనాధ మహిళలు, శిశువులకు శరణాలయాలను స్థాపించారనీ, సత్యశోధక్ సమాజ్ వంటి సంస్థలతో పూలే దంపతులు బడుగు వర్గాల విజ్ఞానవికాసాల కోసం జీవితకాలం కృషిచేశారని పార్టీ నేత అక్కిదాసు కిరణ్‌కుమార్ చెప్పారు. పూలే వంటి మహనీయుల ఆదర్శంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని గత ప్రభుత్వం కూడా బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషిచేసిందని బీసీ నాయకుడు పెదలంక వెంకటేశ్వర్లు గుర్తుచేశారు. పేదపిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్‌మీడియంతో సహా సీబీఎస్ఈ సిలబస్, ట్యాబ్‌లతో ఆధునిక విద్యను అందుకునే అవకాశం కల్పించిందని కుర్రా శ్రీను చెప్పారు. సంక్షేమ పథకాలతో పేదలకు ఆర్థికభరోసాను కల్పించినట్టు కొడాలి క్రాంతి, కోలా వాసు వివరించారు.

నేటి యువత, విద్యార్థులు పూలే జీవితచరిత్రను తెలుసుకోవాలని కాకి దేవసహాయం సూచించారు.



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలే విగ్రహానికి పుష్పాంజలి

కార్యక్రమంలో కాళిదాసు సత్యం, సర్పంచ్ అత్తోట నాగపున్నేశ్వరరావు, జంగం జాని, బాలరాజు, టి.నాగరాజు, సైదులు, షేక్ సుబాని పాల్గొన్నారు.

నవచైతన్య బీసీ సంక్షేమ సంఘం..

తెనాలి మార్కెట్ సెంటర్లోని నవచైతన్య బీసీ సంక్షేమ సేవాసంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మేడిబోయిన గంగాయాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పూలే, ఆయన భార్య సావిత్రిబాయి పూలే చేసిన కృషిని స్మరించుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లంపల్లి భీష్మపాములు, కోశాధికారి నల్లజర్ల గంగాదేవి, పట్టణ అధ్యక్షుడు బట్టు శ్రీనివాసరావు, నియోజకవర్గ అధ్యక్షుడు తాడిబోయిన ప్రవీణ్‌కుమార్ యాదవ్, బుర్రా శ్రీనివాస్, టి.వెంకట్రావు, బొల్లెదు ప్రేమకుమార్, రాయల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



నవచైతన్య బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో పూలేకు నివాళి

ప్రజాచైతన్య విజ్ఞాన వేదికలో పూలే వర్ధంతి

మహాత్మ జ్యోతిరావు గోవిందరావు పూలే 134వ వర్ధంతిని గురువారం స్థానిక దేవీచౌక్‌లో గల ప్రజాచైతన్య విజ్ఞాన వేదికలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కరైట్, ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి యంగ్రపాటి అశోక్‌కుమార్ పూలే జీవితవిశేషాలను, ఆయన చేసిన కృషిని వివరించారు. పూలే జీవితం ఎంతో ఆదర్శమని కొనియాడారు. తన భార్యకు విద్యను చెప్పి దేశంలోనే మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్ది స్త్రీ సమానత్వాన్ని చాటారని చెప్పారు. వీరిద్దరి సామాజిక ఉద్యమంలో ఫాతిమా షేక్ ఆశ్రయం ఇచ్చి వారి పోరాటాలలో భాగస్వామ్యం అయ్యారని గుర్తుచేశారు. విద్యలో స్వేచ్ఛ సమాజంలో విలువలను నేర్పిన గొప్ప సంఘసంస్కర్తలని పేర్కొన్నారు. ప్రజా చైతన్య విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు రావూరి శివకృష్ణ, పంచాక్షరి సాయి మణికంఠ, చిలక సూర్య వృధ్వీదేవ్, భీమవరపు బ్రహ్మానందరెడ్డి, గోళ్లప్రసాద్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదుకావటం యువత బాధ్యత

కాలేజీ విద్యార్థినులతో 'స్వీప్' సదస్సులో సబ్‌కలెక్టర్ సంజనా సింహ

తెనాలి: పద్దెనిమిదేళ్ల నిండిన యువతీయువకులంతా ఓటరుగా నమోదు చేసుకునేందుకు భారత ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ సూచించారు. ఓటరుగా నమోదు చేసుకోవటం వయోజనుల హక్కుగా స్పష్టంచేశారు. 'క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం' (స్వీప్) కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక నాజరుపేటలోని వివేక మహిళా కాలేజిలో ఓటరు నమోదు అవగాహన సదస్సును నిర్వహించారు. తెనాలి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సంజనా సింహ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదుకావటం బాధ్యతగా స్వీకరించాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థలకు చెందిన అన్ని స్థాయిల ఎన్నికల్లో మంచి ప్రజాప్రతినిధులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలోనే ఓటరుగా నమోదు కావటమనే ప్రక్రియ సంక్లిష్టంగా మారకుండా, కేంద్ర ఎన్నికల సంఘం ప్రతి మూడునెలలకోసారి ఓటరుగా నమోదుకు అవకాశం కల్పించిందని వివరించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని, స్థానిక సంస్థలను పాలించే ప్రజాప్రతినిధులను సరైనవారిని ఎంచుకునే అవకాశం ఓటర్లకు ఉంటుందన్నారు. కేవలం విమర్శలతో సరిపెట్టుకోకుండా తమ ఓటు హక్కుతో మంచివారిని ఎన్నుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షించారు. ఎన్నికల సంఘం కరపత్రాన్ని మురళీ, ఠాగూర్‌లు విద్యార్థులకు అందజేశారు.



సబ్‌కలెక్టర్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



వ్రతాన్ని ఆచరింపజేస్తున్న ఆగమ పండితులు



సామూహిక వ్రతంలో పాల్గొన్న దంపతులు

తెనాలి: స్థానిక షరాఫ్‌బజార్‌లోని శ్రీసువర్చలాసమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం 11వ ఉచిత సామూహిక శ్రీరమాసహిత శ్రీ సత్యనారాయణస్వామి వ్రత మహోత్సవం నిర్వహించారు. శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన శ్రీసత్యదేవ వ్రతమహోత్సవంలో 111 మంది దంపతులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైఖానస ఆగమ పండితులు నారాయణం గోవర్ధన లక్ష్మీ రఘురామ్, వేదాంతం నాగమారుతి, అద్దేపల్లి హరికృష్ణ వైదికక్రతువును ఆగమోక్తంగా జరిపించారు. సత్యదేవ వ్రత విశిష్టతను వివరించారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పవిత్ర కార్తిక మాసాన ఆలయంలో ఉచిత శ్రీసత్యదేవ వ్రతాల నిర్వహణ, భక్తులు విశేషంగా పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. భక్తులందరికీ శ్రీ సత్యదేవుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ వ్యవస్థాపకులు ఆర్‌వీ కిరణ్ కుమార్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎస్‌బీ.శివ, నిఖిల్ శాండిల్య, దేవాదాయ శాఖ ఈ.వో హరిప్రసాద్, కౌన్సిలర్ పి.త్రిమూర్తి, శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, జంధ్యం రామారావు, మదుపల్లి చంద్రశేఖర్, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనూరాధ, సేవాసమితి సభ్యులు మాజేటి వెంకటేష్, కట్టమూరి రమణకుమార్, గోలి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీసీఎస్‌కు ఎంపికైన ఏఎస్ఎన్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులకు చైర్మన్ శివకుమార్, డాక్టర్ రామ్‌చంద్

తెనాలి: 2024-25 విద్యాసంవత్సరంలో తొలిగా క్యాంపస్ ఇంటర్వ్యూలను చేసిన ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ టీసీఎస్‌కు స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ఫైనలియర్ విద్యార్థులు ఏకంగా 68 మంది ఎంపికయ్యారు. ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ గురువారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. టీసీఎస్ సంస్థ దేశవ్యాప్తంగా జరిపిన జాతీయ క్వాలిఫైడ్ టెస్ట్‌లో ఎంపికైన వారికి విజయవాడలో ఇంటర్వ్యూలను చేసినట్టు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.2.60 లక్షలుగా చెప్పారు. ప్రపంచ ఆర్థికమాంద్యం పరిస్థితుల్లోనూ ఉద్యోగ అవకాశాలు తగ్గినప్పటికీ కాలేజి విద్యార్థులకు జీవనకళలు, వర్చువల్ సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తూ, గరిష్ఠంగా ఉద్యోగాల సాధనకు తోడ్పడుతున్నట్టు చెప్పారు. నాణ్యమైన విద్యను అందిస్తూ ఉపాధి కల్పనకు కాలేజి వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థికి ఉద్యోగం ఆశయాని నెరవేరుస్తున్న కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, అధ్యాపకులను, ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను శివకుమార్ అభినందించారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు తప్పవు

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. మున్సిపల్ మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న వ్యాపారిపై గురువారం ఆగ్రహం వ్యక్తం చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 మైక్రాన్‌లోపు ఉన్న ప్లాస్టిక్ కవర్లను విక్రయించడాన్ని ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాటిని అమ్మిన, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు ఎవరు తక్కువ రకం ప్లాస్టిక్‌ను విక్రయించవద్దని సూచించారు. ఆయన వెంట పలు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

రేపు భారత రాజ్యాంగం మంచీచెడుపై చర్చాగోష్టి

తెనాలి: భారత రాజ్యాంగ వజ్రోత్సవాల సందర్భంగా ఈనెల 30న తెనాలిలో 'బారత రాజ్యాంగం: మంచి-చెడు' అంశంపై చర్చాగోష్ఠి జరగనుంది. పట్టణ సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 5.30 గంటలకు ఏర్పాటయే సభకు మానవ హక్కుల వేదిక జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రాజనీతిశాస్త్ర ఆచార్యు వి.అంజిరెడ్డి, విప్లవ రచయితల సంఘం నాయకుడు సీఎస్ఆర్ ప్రసాద్ చర్చను ప్రారంభిస్తారని గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఇకపై తరచూ బుర్రిపాలెం వస్తా

సినీ హీరో అశోక్ గల్లా

తెనాలిరూరల్: ఎప్పుడో చిన్నతనంలో బుర్రిపాలెం గ్రామానికి వచ్చానని చాలా కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు గ్రామానికి రావడం చాలా సంతోషంగా ఉందని హీరో గల్లా అశోక్ తెలిపారు. గల్లా అశోక్ హీరోగా నటించిన దేవకి నందన వాసుదేవ సినిమా ఇటీవల విడుదలైన సందర్భంగా గ్రామస్తుల ఆహ్వానం మేరకు గురువారం ఆయన బుర్రిపాలెం వచ్చారు. ఈ సందర్భంగా అశోక్‌కు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో సాయిబాబా ఆలయాన్ని సందర్శించి అక్కడ పూజలు నిర్వహించారు. అనంతరం తన తాత సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ చాలా కాలం తర్వాత బుర్రిపాలెం రావడం జరిగిందన్నారు. ఇక్కడ ఎంతో ఆప్యాయంగా అందరూ స్వాగతం పలికారని ఇకముందుతరచుగా ఇక్కడకు వస్తుంటానని చెప్పారు. తన మూడో చిత్రం సితార ప్రొడక్షన్ బ్యానర్‌లో రాబోతోందని ఇప్పటికే తొలి షెడ్యూల్ షూటింగ్ పూర్తయిందని తెలిపారు.



గల్లా అశోక్‌ను ఊరేగింపుగా తీసుకెళుతున్న బుర్రిపాలెం వాసులు

శనివారం పింఛన్లు పంపిణీ పూర్తి చేయండి

తెనాలిఅర్బన్: శనివారం ఉదయం పింఛన్ల పంపిణీని ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం. లక్ష్మీపతి సూచించారు. సచివాలయ ఉద్యోగులతో గురువారం మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1వ తేదీ ఆదివారం వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక రోజు ముందుగానే పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని సూచించారు. 2వ తేదీ లోపు పింఛన్ల పంపిణీ నూరుశాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి